ఉచిత బస్సు ఏది బాబూ?

- కేవలం హామీలకే పరిమితమవుతున్న కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఊసేలేని ఉచిత బస్సు



ఆర్టీసీ బస్సులు

పుల్లలచెరువు: మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఎదురు చూస్తున్నా కూటమి ప్రభుత్వం మాత్రం ఆ ఊసే లేకుండా పాలన చేస్తున్న వైనాన్ని మహిళాలోకం తీవ్రంగా విమర్శిస్తోంది. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితమంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు ఊదరగొట్టారని, నేడు ఉచిత బస్సు అమలు చేసే విధంగా అడుగులు వేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇచ్చిన మాటను అమలు చేయనప్పుడు హామీ ఇవ్వడం ఎందుకని మహిళలు నిలదీసే పరిస్థితి తలెత్తింది. ఆర్టీసీ ప్రయాణం ఉచితం చేస్తున్నారు కదా.. అని ఓట్లేశామని, తీరా గెలిచిన తర్వాత ఉచిత బస్సు పథకం గురించి మాటైనా మాట్లాడటం లేదని వాపోతున్నారు.

పండగల ముందు ప్రచారం

అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల వేళ కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే అధికారం చేపట్టి 8 నెలలు గడుస్తున్నా ఉచిత బస్సుపై ఏం మాట్లాడటం లేదని మహిళలు వాపోతున్నారు. పండగలు వస్తున్నాయంటే ఉగాది నుంచి, దసరా, సంక్రాంతి అంటూ తెరపైకి తెస్తారు. మంత్రి వర్గంలో కూడా దీనిపై చర్చించామంటూ ప్రచారం చేస్తారు. రోజులు గడచిపోతున్నా హామీని మాత్రం అమలు చేయడం లేదు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి ప్రజలు రోజూ ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఉచిత బస్సు పథకం అమలు చేయలేదంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకపడుతున్నారు. నలుగురు మహిళలు కలిస్తే ఉచిత బస్సు, ఫీజురీయిబర్స్‌మెంట్, తల్లికి వందనం వంటి పథకాలపై చర్చ చేసుకుంటూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వై.పాలెం నియోజకవర్గంలోని మహిళల వివరాలు

యర్రగొండపాలెం	23700
పుల్లలచెరువు	21500
త్రిపురాంతకం	24500
దోర్నాల	17000
పెద్దారవీడు	17300

అమలు చేయలేనప్పుడు హామీ ఇవ్వడమెందుకు

మహిళలను ఆకర్షించేందుకు ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. తీరా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పథకం గురించి మాట్లాడక పోవడం దారుణం. మహిళలకు హామీ ఇచ్చిన ప్రకారం ఉచిత బస్సు పథకాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలి.



– రమణమ్మ, బీసీ మహిళా సంఘ అధ్యక్షురాలు, పుల్లలచెరువు

8 నెలలు గడిచింది

కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినా ఇంతవరకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా తల్లీకి వందనం, ఉచిత బస్సు పథకాన్ని వెంటనే అమలు చేయాలి.



– బంకా విజయ కుమారి, ఏఎంసీ మాజీ డైరెక్టర్, పుల్లలచెరువు

కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అయితే హామీ ఇప్పటి వరకూ అమలు చేయలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని అమలు చేశాయి. ఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేస్తే మహిళలకు కొంత మేరకు ఊరట కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.



– ఆవుల నారాయణమ్మ, సర్పంచ్, నాయుడుపాలెం

క్లుప్తంగా

100 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నంద్యాల శాంతీరామ్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 100 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మేజర్ పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్సలు అవసరమైన 10 మందిని నంద్యాలకు శాంతీరామ్ మెడికల్ కళాశాలకు తీసుకెళ్లనున్నట్లు వైద్యులు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

తాళ్లూరు: వేసవిలో ప్రతి గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి హనుమంతరావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బోర్లను రిపేరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో చేతి పంపులను మరమ్మతులు చేయించి రాబోవు వేసవిలో నీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లదేనన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

తాళ్లూరు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీడీవో హనుమంతురావు అన్నారు. మండలంలోని తూర్పు గంగవరం పీహెచ్‌సీలో గురువారం హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం డాక్టర్ మౌనిక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి ఒక్క రోగికి సరైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీపీ శ్రీనివాసులు, జెడ్పీటీసీ వెంకట్‌రెడ్డి, వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, స్టాఫ్ నర్సులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుల గుర్తింపునకు స్క్రీనింగ్



ఏలూరులో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) సర్వే నిర్వహిస్తున్నట్లు ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఎం.సుగుణకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్తులను కనుగొనడం సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ముందుగానే వ్యాధిగ్రస్తులను గుర్తిస్తే క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకుని చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. సర్వేలో భాగంగా క్యాన్సర్, సుగర్, బీపీ పరీక్షలు కూడా చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 49,318 మందిని సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 16600 మందిని స్క్రీనింగ్ చేసినట్లు చెప్పారు. సర్వేలో డాక్టర్ టి.సుష్మ, సిబ్బంది ఎల్.శ్రీనివాసరెడ్డి, జిలానీ, ఆదిలక్ష్మి, శ్రీధర్, బాజీ, అవినాష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే తాటిపర్తి, మాజీ జెడ్పీటీసీ రామిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు

పెద్దదోర్నాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు ఆ పార్టీ మండల నాయకులు గురువారం కలిశారు. యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాడిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు అమిరెడ్డి లక్ష్మీరెడ్డి, మండల యవత అధ్యక్షుడు గొలమారి రాజశేఖరరెడ్డి, చిన్నగుడిపాడు సర్పంచ్ పవన్‌కుమార్, జిల్లా ఎస్టీ నాయకులు చంద్రకాంత్‌నాయక్ ఉన్నారు.

ఢిల్లీ ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

దర్శి: ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద రామ్‌లీలా మైదానంలో జరిగే ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎల్ఐసీ ఏఓఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు రాగిపిండి రామకోటిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకోటిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ఎల్ఐసీలో తెచ్చిన సంస్కరణలను తిరిగి వెనక్కు తీసుకోవాలని పేర్కొన్నారు. నూతనంగా 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రూపాయలు ప్రవేశ పెట్టిన పాలసీలను కాకుండా లక్ష రూపాయలు పాలసీలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాత కమీషన్ అమలు చేయాలని, పాలసీదారులకు జీఎస్టీ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే కాలేబాషా, గౌరవ అధ్యక్షుడు బోడపాటి హనుమంతరావు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి తాండవ రంగారావు, నాగేశ్వరరావు, ఏజెంట్లు పిచ్చయ్య, భిక్షాలరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి

పెద్దదోర్నాల: పట్టుదలతో అద్భుతమైన విజయాలు సాధించి చదువుకున్న పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 10వ తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది కొరతపై ఆయన మాట్లాడుతూ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. దీంతో పాటు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల శాతం ఎక్కువగా ఉన్న దృష్ట్యా బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, నాగమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



ట్రావెలింగ్, ఎస్కార్ట్ అలవెన్స్‌లు అందుకుంటున్న విద్యార్థులు

పెద్దదోర్నాల: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే అవకాశాలను వినియోగించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఎంసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులకు మంజూరైన ట్రావెలింగ్, ఎస్కార్ట్ అలవెన్స నగదును విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్‌ల కింద రూ.3 వేలు చొప్పున 18 మంది విద్యార్థులకు 54 వేల రూపాయలు, ఎస్కార్ట్ అలవెన్సు కింద నలుగురు విద్యార్థులకు 12 వేల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నరసింహస్వామి పుట్ట తిరునాళ్ల



ప్రత్యేక అలంకారంలో యోగానంద నరసింహస్వామి మూలవిరాట్



ఆలయంలో వెలసిన నాగేంద్ర పుట్ట



తోకపల్లిలో ముస్తాబైన యోగానంద నరసింహస్వామి ఆలయం

పెద్దారవీడు:

మండలంలోని తోకపల్లెలో భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ సద్గురు యోగానంద నరసింహస్వామి వారి 69వ పుట్ట తిరునాళ్ల మహోత్సవం భీష్మ ఏకాదశి శనివారం, ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శనివారం తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్తాన తీర్థపు బిందెతో సద్గురువుకు పంచామృతాభిషేకం, అలంకరణ పూజా, మంత్రపుష్ప నీరాజనం, ప్రసాద వినియోగం, ఉదయం 9 గంటలకు దీక్షా స్వాముల ఇరుముడి, 11 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం, మధ్యాహ్నం 4 గంటలకు నరసింహస్వామి హోమం, ఆలయంలో దీక్ష స్వాముల దీక్ష విరమణ, ఆదివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, వివిధ పూజలు, సాయంత్రం స్వామి గ్రామోత్సం నిర్వహించనున్నట్లు అర్చకులు భవానీ ప్రసాద్ తెలిపారు. స్వామి వారి దీక్ష 41 రోజులు మాలధారణను గ్రామానికి చెందిన వారే కాక ఇతర మండలాల భక్తులు కూడా దీక్షలు స్వీకరిస్తుంటారు.

స్వామి వారి చరిత్ర

భారతదేశం దేవతలకు, మునులకు, సత్పురుషులకు, సద్గురువులకు నిలయం. ఆ అంశంలోనే శ్రీ సద్గురు యోగానంద నరసింహస్వామి వారు మార్కాపురం తాలుకా తోకపల్లిలో 1886లో వ్యయ నామ సంవత్సరం మాఘమాస శుద్ధ ఏకాదశి పగలు 11.11 గంటలకు కొండెబోయిన గురుమూర్తి, లక్ష్మాంబ అను పుణ్య దంపతులకు శ్రీ పుట్టా నాగేంద్రస్వామి వారి కరుణా కటాక్షాలతో జన్మించారు. తల్లిదండ్రులు సుబ్బరాయుడని నామకరణం చేశారు. బాల్యాన పాఠశాలకు వెళ్లినా తోటి విద్యార్థులతో కలవక ఏకాంతంగా కూర్చొని ఆకాశం వైపు తదేకంగా చూస్తూ ఉండేవారు. విద్యపై ఆసక్తి చూపక పాఠశాలలో పలకా బలపం వదిలి గోవులను కాచే బాలురతో అడవికి వెళ్లేవాడు. నాటకాల కంపెనీలో చేరి కొంత కాలం పని చేశారు. తెల్లదొరల వద్ద సిపాయిగా ఉద్యోగం చేసెను. వైష్ణవాచార్యుడి దగ్గర బ్రహ్మ విద్యను నేర్చి స్వామి వారు తోకపల్లి నుంచి బయల్దేరి శ్రీశైలం గృహాల్లో 12 సంవత్సరాలు గోర తపస్సు చేసెను. సూర్య భగవానుడు ప్రత్యక్షమై ఘంటమును తాటి ఆకు పత్రాలను ఇచ్చెను. లక్ష్మీనరసింహస్వామి వారు ప్రత్యక్షమై యోగానంద నరసింహస్వామిగా పిలువ బడుతావని వరమును ఇచ్చెను. మార్కాపురంలో కలరా కనపడిన విషయం స్వామి దీక్షలో గ్రహించి చెన్నకేశవస్వామితో సంవాదమాడి కలరాను శాంతింపజేసి మహిమలు చూపెను. మార్కాపురం దగ్గరలోని అమ్మవారిపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండ కింద జీవసమాధి అయ్యెను. భక్తులకు కల్ప తరువు, కామధేనువు, సంతాన ప్రధుడు, భూత ప్రేత పిశాచములు పారద్రోలు మహా మహిమాన్విత సద్గురువు. అట్టి సద్గురువుకు ప్రతి సంవత్సరం భీష్మ ఏకాదశి రోజున పుట్ట తిరునాళ్ల మహోత్సవాలు గ్రామస్తులు నిర్వహిస్తుంటారు. స్వామి మహిమలు ఆ నోటా ఈ నోటా పడి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారు. భక్తులు ఇచ్చే విరాళాలతో కమిటీ సభ్యులు ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణపై డీఎస్పీ విచారణ



స్థానికులను విచారిస్తున్న డీఎస్పీ నాగరాజు

పుల్లలచెరువు: మండల పరిధిలోని మానేపల్లిలో ఇటీవల రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగిన విషయం తెల్సిందే. గ్రామానికి చెందిన కొండా అశోక్, పాతకోటి అంకిరెడ్డిల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. మార్కాపురం డీఎస్పీ నాగరాజు గురువారం మానేపల్లి గ్రామానికి చేరుకొని ఘర్షణకు కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమెదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్, పోలీసులు ఉన్నారు.

హనుమంత వాహనంపై శ్రీవారి దర్శనం



హనుమంత వాహనంపై శ్రీవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలోని జంకె రామిరెడ్డి నగర్‌లో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు ఉభయదేవేరులతో కలిసి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి, ఉత్సవమూర్తులకు పంచామృత స్నపన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేజే నరసింహం, కోశాధికారి పీవీ శ్రీనివాసులు, ఏరువ దేవిరెడ్డి, గోగురామయ్య పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జంకె తదితరులు

నిందితుల అరెస్టు

యర్రగొండపాలెం: స్థానిక అవంతి మెడికల్స్ యజమానిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.చౌడయ్య గురువారం తెలిపారు. ఈ నెల 3వ తేదీన కృష్ణనాయక్, సి.బాబు అనే వ్యక్తులు మందులు కొనుగోలు చేశారు. అందుకు సంబంధించిన బిల్లు పే చేయమని ఆ మెడికల్స్ యజమాని మల్లికార్జున్ అడిగాడని, తాము డబ్బులు ఇచ్చేది ఏందని నిందితులు అతనిపై దాడి చేశారని తెలిపారు. మల్లికార్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌లు పొందండి

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌లు పొందాలని గురువారం ఆ కళాశాలలో ఇంటర్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు ఓపెన్ డే నిర్వహించారు. తమ కళాశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులు ఉన్నారని, ఇక్కడ మంచి విద్యాను బోధించే లెక్చరర్లు, ఫ్యాకల్టీ సదుపాయం, విద్యార్థులకు అవసరమైన వసతులు ఉన్నాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, అధ్యాపకులు ఆర్.గోపి, జి.పుష్పరాజ్ పాల్గొన్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

రైతులు పంట నమోదు చేసుకోవాలి

దర్శి: రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని రాజంపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ వరిలో ఉల్లికోడు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తెగుళ్ల విషయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లో పంట నమోదు చేసుకుంటేనే పంట నష్టం వాటిల్లినప్పుడు ఇన్సూరెన్స్‌లు వర్తిస్తాయని చెప్పారు. డ్రిప్ సబ్సిడీపై అందించనున్నట్లు పేర్కొన్నారు. కంది వేసిన రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. గ్రామ కార్యదర్శి ఎస్.దేవదానం, వ్యవసాయ సహాయకులు షేక్ అబ్దుల్ సత్తార్, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.